సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం · 19 · జూన్ · 2025



ఈసారి 71 లక్షల మొక్కలు..
జూలై 1 నుంచి నిర్వహించే వన మహోత్సవంలో జిల్లా వ్యాప్తంగా 71.41 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. 8లో



పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వాలి
పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సభ్యులు సూచించారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
35° / 27°
జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. కొన్ని చోట్ల సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధికల్పనా శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. సంస్థలో 33పోస్టులు ఖాళీగా ఉండగా, జిల్లా వ్యాప్తంగా 80 మంది హాజరయ్యారని, వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి 19 మందిని ఎంపిక చేశామని వివరించారు. వారికి కేటాయించిన సెంటర్లలో గడువులోగా విధుల్లో చేరి ఉత్తమ భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా టీజీ టెట్



పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

సుజాతనగర్: మండలంలోని వేపలగడ్డలో గల అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన టీజీ టెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొదటి షిఫ్ట్‌లో 120 మంది అభ్యర్థులకు గాను 104 మంది హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 110 మందికి 100 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు. రెండు షిఫ్ట్‌ల్లో కలిపి 26 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

మాతా, శిశు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: మాతా, శిశు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్లలోని ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫీసును సందర్శించారు. ఎన్జీఓ నిర్వహించిన వివిధ ఆరోగ్య కార్యకలాపాలను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన పెంచడంలో, ఆరోగ్య విద్య ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అల్ట్రాసౌండ్ స్కానింగ్ యూనిట్ పనితీరును కూడా తనిఖీ చేసి, సరైన రికార్డులను నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. చికిత్సకోసం వచ్చిన వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫైజ్‌మోహినుద్దీన్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

తెలంగాణలో తొలిసారి



భద్రాచలం మండల పరిషత్ కార్యాలయం

ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్న నేపథ్యంలో భద్రాచలం మండల పరిషత్ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ఇక్కడున్న మండల పరిషత్ తరలిపోయి, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏర్పాటైంది. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత భద్రాచలం మండల పరిషత్‌కు తొలిసారి ఎన్నికలు జరగబోతుండడం విశేషం. దీంతో ఎంపీటీసీలుగా పోటీ చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఇప్పటి నుంచే ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. – భద్రాచలం

తరలిపోయి.. తిరిగొచ్చిన మండల పరిషత్
- పుష్కరకాలం తర్వాత భద్రాచలంలో ఎన్నికలకు సన్నాహాలు
- నాడు 13.. నేడు 14 ఎంపీటీసీ స్థానాలు
- జెడ్పీటీసీ పీఠంపై ఆశావహుల ఆరాటం

రాష్ట్ర విభజనతో కనుమరుగు..
భద్రాచలం మండల పరిషత్ తొలిసారి జనవరి 1, 1987న ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 42 మంది అధికారులు పూర్తి, ఇన్‌చార్జ్ బాధ్యతల్లో పని చేశారు. ఈ మండల పరిషత్‌కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరి సారిగా 2014 జనవరిలో ఎన్నికలు జరగగా, పాలకవర్గ పదవీ కాలం 2018లో ముగిసింది. నాడు 13 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగగా, చివరి ఎంపీపీగా ఊకా శాంత, జెడ్పీటీసీగా రవికుమార్ బాధ్యతలు నిర్వర్తించారు. అయితే 2014 జూన్‌లో రాష్ట్ర విభజన అనంతరం భద్రాచలం మండల కేంద్రం మినహా ఇతర గ్రామాలన్నీ ఏపీలో విలీనం చేశారు. పాలకవర్గ పదవీ కాలం ముగిసిన తర్వాత అభివృద్ధికి సరైన ప్రణాళిక లేక మండల పరిషత్ నిర్వీర్యంగా మారింది. దీంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భద్రాచలం మండల పరిషత్‌ను కొత్తగా ఏర్పాటు చేసిన ఆళ్లపల్లికి తరలించారు. ఇక్కడి ఉద్యోగులను సైతం డిప్యూటేషన్‌పై ఇతర చోట్ల సర్దుబాటు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి భద్రాచలానికి మండల పరిషత్‌ను కేటాయించారు. దీంతో వెళ్లినట్టే వెళ్లిన మండల పరిషత్ మళ్లీ తిరిగి వచ్చింది.

నాడు 13.. నేడు 14 ఎంపీటీసీ స్థానాలు
2014 జనవరి ఎన్నికల్లో భద్రాచలంలో 13 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఆ తర్వాత జనాభా ప్రాతిపదికన ఒక స్థానం పెంచారు. దీంతో త్వరలో 14 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కాగా భద్రాచలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 50,088 మంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 80 వేల నుంచి లక్ష వరకు ఉంటుందని అనధికారికంగా అంచనా వేస్తున్నారు. ఇందులో పురుష ఓటర్లు 19,752, మహిళలు 21,254, ఇతరులు ఇద్దరు కలిపి మొత్తం 41,008 మంది ఓటర్లు ఉన్నారు. 20 వార్డులుగా విభజించగా, ఎన్నికలు సులువుగా నిర్వహించేందుకు 60 పోలింగ్ బూత్‌లు సిద్ధం చేశారు. కాగా, మండల పరిషత్ కార్యాలయం పూర్తి శిథిలావస్థకు చేరగా, రికార్డులు అత్యధిక భాగం కాలిపోయాయి. ప్రస్తుతం ఎంపీడీఓతో పాటు మరో ముగ్గురు ఉద్యోగులు ఉండగా అందరూ ఇన్‌చార్జ్‌లే. మండల పరిషత్ భవనానికి మరమ్మతులు చేపట్టి, పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమిస్తే పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంటుందని స్థానికులు అంటున్నారు.

జెడ్పీటీసీ పీఠంపై ఆరాటం..
రాజకీయ పార్టీల్లో ఇప్పటికే మండల పరిషత్ ఎన్నికల కోలాహలం మొదలైంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు తోడు ఆ తర్వాత ఎంపిక చేసే ఎంపీపీ పీఠంపై ఇప్పటి నుంచే లెక్కలు వేస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించకపోయినా తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కాంగ్రెస్ పార్టీలో పోటీ తీవ్రంగా ఉండడంతో పలువురు ఆశావహులు ఇటీవల బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. వీరితో పాటుగా సీపీఐ, సీపీఎం, టీడీపీ, బీజేపీ నాయకులు సైతం జిల్లా నాయకత్వాలకు తమ ప్రతిపాదనలు పంపారని సమాచారం.

పూర్వ వైభవం తేవాలి



రాష్ట్ర విభజనతో జరిగిన నష్టాల్లో మండల పరిషత్ కోల్పోవడం ఒకటి. స్థానికుల కోరిక మేరకు తిరిగి మండల పరిషత్ రావటం హర్షణీయం. శిథిలావస్థకు చేరిన ఎంపీడీఓ కార్యాలయాన్ని ఎన్నికలకు ముందే మరమ్మతులు చేయాలి. పూర్తి స్థాయిలో ఉద్యోగులను కేటాయించాలి. త్వరగా ఎన్నికలు నిర్వహించి భద్రాచలాన్ని మళ్లీ అభివృద్ధి బాట పట్టించాలి.
– చల్లగుళ్ల నాగేశ్వరరావు, భద్రాచలం

గురుకులాల్లో.. లోటుపాట్లు ఉండొద్దు



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన డిప్యూటీ సీఎం భట్టి, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు అనుదీప్, పాటిల్, తదితరులు

- ఉన్నతాధికారులు తరచూ తనిఖీ చేయాలి
- అవసరమైన అన్ని ప్రాంతాలకూ బస్సు సర్వీసులు
- ఉమ్మడి జిల్లాస్థాయి సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం గురుకులాల నిర్వహణ కొనసాగాలని డిప్యూటీ సీఎం మల్లు భటి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా, ఎక్సైజ్ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఖమ్మం కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి.పాటిల్, సీపీ సునీల్‌దత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుకులాలు, వసతిగృహాల నిర్వహణ, బీసీ సంక్షేమ, రవాణా, ఎక్సైజ్ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, వనమహోత్సవం నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. సరైన వసతులు లేని గురుకులాలను ప్రత్యామ్నాయ భవనాల్లోకి మార్చాలని, ఎక్కడా దోమల బెడద లేకుండా జాలీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కామన్ డైట్ కచ్చితంగా అమలయ్యేలా జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు గురుకులాలు, హాస్టళ్లను తనిఖీ చేయాలని తెలిపారు. మొక్కలు నాటేందుకు గతంలో రూ.వేల కోట్లు ఖర్చు చేసినా, ఎన్ని బతికాయో లెక్కలు చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. ఈసారి అలాకాకుండా మొక్కల పెంపకాన్ని బాధ్యతగా భావించాలని సూచించారు. కాగా, బస్సు సర్వీసులు అవసరమైన గ్రామీణ రూట్లపై ప్రతిపాదనలు సమర్పిస్తే నూతన బస్సులు కొనుగోలు చేస్తామని తెలిపారు.

ఐఐటీ, నీట్‌పై శిక్షణ అందించాలి..
గురుకులాల్లో విద్యాప్రమాణాలు మరింత మెరుగుపరుస్తూ, ఐఐటీ, నీట్‌ల్లో మంచి ఫలితాలు సాధించేలా శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. పెరిగిన డైట్ చార్జీల ఆధారంగా కామన్ డైట్ అమలు చేయాలని తెలిపారు. గ్రామీణ యువత ఉద్యోగాలు సాధించేలా బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ ఏడాది వన మహోత్సవంలో ఈత, తాటి మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తూ గీత కార్మికులను భాగస్వామ్యం చేయాలని కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పీఎంఈ స్కీం ద్వారా ఎలక్ట్రికల్ బస్సులు తీసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగులు, హస్తకళా సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం మేయర్ పి.నీరజ, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భూముల ధరలు సవరణ?

- గత కమిటీల నిర్ణయాలను ఖరారు చేసే అవకాశం
- బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా పెంపు
- జిల్లాలో పలుచోట్ల మార్పులకు అవకాశం

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. భూముల విలువ పెంపుపై గతేడాదే కసరత్తు చేసినా ప్రతిపాదనలకే పరిమితమైంది. అప్పట్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో జిల్లాలో భూముల విలువ పెంపుపై నివేదికలు సిద్ధం చేశారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ధరలతో పోలిస్తే బహిరంగ మార్కెట్ విలువ అధికంగా ఉన్నందున, అందులో సగం మేర పెంచినా ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం పెరుగుతుందని భావించారు. ఈ అంశంపై తాజాగా ప్రభుత్వం మళ్లీ కసరత్తు మొదలుపెట్టడంతో జిల్లాలో ఎక్కడెక్కడ భూముల విలువ పెరుగుతుందనే అంశంపై చర్చ జరుగుతోంది.

ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు
భూముల ధరల పెంపునకు సంబంధించిన ప్రక్రియను గతేడాది జూన్‌లో జిల్లా కమిటీలు, సబ్ రిజిస్ట్రార్లు పూర్తి చేయగా.. ఆ ప్రతిపాదనలను ఇటీవల ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్ కార్యాలయాలతో పాటు 11సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల విలువల సవరణపై నివేదికలు అందించినట్లు సమాచారం. అయితే గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేసిన సమయాన ఉన్న అధికారులు ఇప్పుడు లేకపోవడంతో ప్రస్తుత అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. భూముల విలువ పెంపు సక్రమంగా జరిగిందా, ఇంకా ఏమైనా సవరణలు అవసరమా అని పరిశీలిస్తుండగా.. పెద్దగా మార్పులేమీ ఉండకపోవచ్చని తెలిసింది.

రూ.400 కోట్ల మేర ఆదాయం
ప్రభుత్వం వ్యవసాయ, వ్యవసాయేతర భూవిలువలను పెంచితే ఉమ్మడి జిల్లా నుండి ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల రూపంలో రూ.400 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశముందని అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఉన్న ధరలతో ఉమ్మడి జిల్లా నుంచి ఏటా రూ.264 కోట్ల వరకు ఆదాయం నమోదవుతోంది. భూవిలువ పెరిగితే ఈ ఆదాయం గణనీయంగా పెరుగుతుందని.. అంచనాలకు మించి నమోదయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

భారీగా తేడా..
ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ సవరింపు జరగనున్నట్లు తెలిసింది. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే ప్రస్తుతం రిజిస్ట్రేషన్ సమయాన అమలుచేస్తున్న ధరల్లో భారీగా తేడా ఉంటోంది. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండగా, భూవిలువల పెంపుపై గతేడాది కమిటీల నిర్ణయం ప్రకారమే కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. రెండు వారాల క్రితం జిల్లా రిజిస్ట్రార్లతో నిర్వహించిన సమావేశంలో గత ప్రతిపాదనలనే ఖరారు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత ప్రతిపాదనలనే పరిగణనలోకి తీసుకుంటే ఖమ్మం కలెక్టరేట్ ప్రాంతంలోని రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం, చింతకాని మండలం వందనం, కొణిజర్ల మండలం తనికెళ్ల, అమ్మపాలెం రెవెన్యూ పరిధిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ భారీగా పెరుగుతుందనే చర్చ జరుగుతోంది. ఈ ప్రాంతాల్లో మెయిన్ రోడ్డు వెంట ఉన్న వ్యవసాయేతర భూముల విలువ ప్రస్తుత ధరకు నాలుగు నుండి ఐదు రెట్లు పెరిగే అవకాశముందని చెబుతున్నారు. మిగతా ప్రాంతాల్లోనూ బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా రిజిస్ట్రేషన్ సమయాన నిర్ణయించే ధరలు 50శాతం మేర పెరిగే అవకాశముంది.

అంతా రహస్యమే..!

- అప్పారావుపేట ఫ్యాక్టరీలో ఏ విషయమూ బయటకు రాదు
- ఆయిల్‌ఫెడ్‌లో అంతా అయోమయం..
- గంటకు 90 టన్నుల క్రషింగ్ వట్టిమాటేనా..?



దమ్మపేట మండలం అప్పారావుపేటలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

అశ్వారావుపేట: ఆ ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీలో అంతా రహస్యమే. అక్కడ ఏం పనులు చేశారు..నిర్వహణ ఎలా ఉందనే విషయాలు బయటకు రావు. అలా రాకుండా తెలంగాణ ఆయిల్ ఫెడ్ అధికారులు, ఓ ఆస్థాన కాంట్రాక్టర్ చర్యలు చేపడుతుంటారనే విమర్శలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. దమ్మపేట మండలం అప్పారావుపేటలో రూ.100 కోట్ల అప్పుతో 2016లో గంటకు 30 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ప్రపంచ స్థాయి ఫ్యాక్టరీని నిర్మించామని నాటి పాలకులు గొప్పలు చెప్పారు. అయితే ఈ ఫ్యాక్టరీపై ఆది నుంచీ పలు విమర్శలు వెల్లువెత్తుతున్నా.. దమ్మపేట మండల పరిధిలోనిది కావడంతో ఏదీ బయటకు పొక్కనీయకుండా అక్కడి నాయకులు, అధికారులు, పాలకులు జాగ్రత్త పడేవారు. అలా అవినీతి వేళ్లూనుకుపోయి కుంభకోణాలకు దారి తీసింది.

సంగతేంటంటే..
అప్పారావుపేట ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని 90 టన్నులకు విస్తరిస్తూ గత ప్రభుత్వం రూ.50 కోట్లతో పనులు ప్రారంభించగా 9 నెలల క్రితం పూర్తయ్యాయి. కానీ ఫ్యాక్టరీ సామర్థ్యం 90 టన్నులకు చేరలేదు. ఈ విషయాన్ని ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని కాంట్రాక్టర్‌కు బిల్లులు ఆపినట్లు సమాచారం. అయితే ఫ్యాక్టరీలో ఎలాంటి మార్పులు చేయకున్నా.. కొంత కాలం తర్వాత ఓ మంత్రి సూచనతో బిల్లు చెల్లించినట్లు తెలిసింది. ఇక 90 టన్నుల క్రషింగ్ సామర్థ్యం ఉన్న ఫ్యాక్టరీ.. ప్రస్తుతం ఎంత మేర చేస్తుందనేది కూడా ఎవరికీ తెలియనివ్వరు. ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ మొదలు జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి వరకు ఎవరినడిగినా వాస్తవాలు వెలుగులోకి రావు. పైగా ఇది అడగరాని విషయమని అంటారు. గతంలో ఏపీకి చెందిన వెయ్యి టన్నుల ఆయిల్‌పామ్ గెలలను క్రషింగ్ చేసిన సమయంలో రోజుకు ఎన్ని టన్నులు జరిగిందో ఫ్యాక్టరీ రికార్డుల్లో నమోదై ఉంటుంది. కానీ ఆ వివరాలూ కూడా వెల్లడించరు.

మార్పులకు అవకాశం లేదా ?
ఫ్యాక్టరీని 90 టన్నుల సామర్థ్యానికి తీసుకొచ్చేందుకు అవసరమైన మార్పులు చేపట్టలేని విధంగా నిర్మించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలా చేయాలంటే ఫ్యాక్టరీలోని కీలక భాగాలను పూర్తిగా తొలగించాల్సిందేనని తెలుస్తోంది. బ్రాయిలర్ గంటకు 90 టన్నుల క్రషింగ్‌కు సరిపడా స్టీమ్‌ను ఉత్పత్తి చేయగలిగినా ప్లాంటుకు విడుదల చేయలేదని నిపుణులు తేల్చినట్టు సమాచారం. అంతే కాక స్టెరిలైజర్లు 90 డిగ్రీల వ్యత్యాసంతో అమర్చడంతో ఆయిల్ రికవరీపైనా దుష్ప్రభావం పడుతుందని అంటున్నారు. ఇన్ని అనర్థాలు ఉన్నా.. మచ్చలేని మంత్రిగా చెలామణి అయ్యే ఓ రైతుబాంధవుడి పాత్ర ఉండడం వల్లే ఏ విషయమూ బయటకు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లోపాలుంటే సరి చేస్తాం
తెలంగాణలో ఆయిల్‌ఫెడ్‌ను ఉన్నత స్థానంలో ఉంచేందుకు, ఫ్యాక్టరీలు నిర్మించేందుకు మేం చాలా కష్టపడుతున్నాం. ఫ్యాక్టరీ క్రషింగ్‌లో లోపాలుంటే సరిచేయిస్తాం. కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. క్రషింగ్ వివరాలు త్వరలో వెల్లడిస్తాం.
– సుధాకర్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ జీఎం

సహకార శిక్షణ ఇక ఇక్కడే..

- నాలుగు జిల్లాలకు కలిపి ఖమ్మంలో..
- చట్టాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం



ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు సహకార శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేసింది. సహకార వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ శిక్షణా కేంద్రాలను విస్తృతం చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యాన మల్టీ జోన్ –1గా హైదరాబాద్, మల్టీ జోన్ –2గా వరంగల్‌లో మాత్రమే కేంద్రాలు కొనసాగుతున్నాయి. కానీ రాష్ట్రంలోని 60 వేల సహకార సంఘాల నిర్వాహకులకు శిక్షణ ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని భావించిన ప్రభుత్వం .. కొత్తగా మరో మూడు కేంద్రాలను మంజూరు చేసింది. వీటిని ఖమ్మంతో పాటు నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో ఏర్పాటుచేసేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నాలుగు జిల్లాలకు కలిపి..
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో సహకార ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చేలా ఖమ్మంలో కేంద్రాన్ని నెలకొల్పుతారు. ఖమ్మం జిల్లాలోని 76 పీఏసీఎస్‌లు, ఏడు జిల్లా స్థాయి సొసైటీలు, 818 ఎయిడెడ్, 434 అన్ ఎయిడెడ్ సొసైటీలతో పాటు భద్రాద్రి జిల్లాలోని 21 పీఏసీఎస్‌లు, ఒక జిల్లా స్థాయి సొసైటీ, 316 ఎయిడెడ్, 315 అన్ ఎయిడెడ్ సొసైటీలే కాక మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని సంస్థల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ కేంద్రం అందుబాటులోకి రానుంది. కాగా, ఈ కేంద్రం నిర్వహణకు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సంబంధిత అంశాల్లో అనుభవం కలిగిన ఫ్యాకల్టీని నియమించడమే కాక అవసరమైన భవనాన్ని కేటాయించాల్సి ఉంటుంది.

చట్టాలపై అవగాహన..
సహకార వ్యవస్థల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది, అనుబంధ సంస్థలు, ప్రజాప్రతినిధులు, డైరెక్టర్లకు సహకార చట్టం, సహకార వ్యవస్థ నిర్వహణపై అవగాహన పెంచేలా ఈ కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. ప్రధానంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), గొర్రెల పెంపకందారులు, మత్స్య సహకార సంఘాలు, కార్మిక సహకార సంఘాల నిర్వాహకులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారులు, స్టాఫ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ స్టాఫ్, డైరెక్టర్లకు ఈ కేంద్రం ద్వారా చట్టాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే, కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ఉద్యోగులు, ప్రతినిధులకు కూడా ఇక్కడే శిక్షణ ఇస్తున్నారు. సహకార చట్టాలతో పాటు వ్యవస్థ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ఆడిట్, వ్యాపార లావాదేవీలే కాక నూతనంగా సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చేలా ఈ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

కరకట్ట పరిసరాలు శుభ్రంగా ఉండాలి

పంచాయతీ సిబ్బందికి పీఓ ఆదేశం



బూర్గంపాడు : గ్రామసభలో మహిళకు గుర్తింపు కార్డు అందిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని, వారంతా గోదావరిలో స్నానమాచరించే అవకాశం ఉన్నందున కరకట్ట ప్రాంతాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. గోదావరి కరకట్ట పక్కనున్న అనధికార డంపింగ్ యార్డ్‌లో బుధవారం కొందరు చెత్తకు నిప్పంటించగా భారీగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించిన పీఓ.. గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావుకు పలు సూచనలు చేశారు. కరకట్ట ప్రదేశాల్లో చెత్త వేయకుండా సిబ్బందిని కాపలా ఉంచాలని, సేకరించిన చెత్తను కొత్తగా నిర్మించిన డంపింగ్ యార్డ్‌లోనే వేయాలని ఆదేశించారు.

ధర్తీ ఆభా యోజనను సద్వినియోగం చేసుకోవాలి
బూర్గంపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ధర్తీ ఆభా యోజన పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని పీఓ రాహుల్ అన్నారు. కృష్ణసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ గిరిజనుల సౌకర్యార్థం ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని, జిల్లాలోని 130 పంచాయతీయలకు ఇది వర్తిస్తుందని చెప్పారు. ఈ పథకం ద్వారా గిరిజన కుటుంబాల వారికి అవసరమైన గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు. మీ సేవ కేంద్రాలకు, నెట్ సెంటర్లకు వెళ్లకుండా అధికారులు ఇంటికే వచ్చి అందజేస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయా గ్రామాలకు వచ్చిన అధికారులను కలిసి గుర్తింపు కార్డుల కోసం రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ బాలయ్య, ఏఓ శంకర్, పీఏఓ విజయలక్ష్మి, ఏపీఎం నాగార్జున తదితరులు పాల్గొన్నారు. అనంతరం గిరిజన గురుకుల సంక్షేమ కళాశాలను సందర్శించారు. విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్, అధ్యాపకులకు సూచించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, వారు మాదక ద్రవ్యాలకు అలవాటుపడకుండా ప్రత్యేక నిఘా పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు, ఎంపీ



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేలు, ఎంపీ

ఇల్లెందు: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, మహబూబాబాద్ ఎంపీ బలరామ్‌నాయక్ బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఇల్లెందు, భద్రాచలం, వైరా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, మాలోతు రాందాస్ నాయక్ సీఎంను కలవగా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, నిధుల మంజూరు ప్రతిపాదనలు సమర్పించారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచేలా దృష్టి సారించాలని సీఎం వారికి సూచించారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్



దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

చుంచుపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారం సులభతరమవుతుందని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. మండలంలోని వెంకటేశ్వరకాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించి భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టం అమలులోకి తెచ్చిందన్నారు. తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ మంగ్యా, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ములకలపల్లి: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై బుధవారం కేసు నమోదైంది. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం సీతారాంనగరానికి చెందిన వేటగాని నాగరాజు (21)కు ములకలపల్లి మండలంలోని నల్లివారిగూడెం గ్రామానికి చెందిన గీతతో సుమారు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఈ దంపతులకు కుమారుడు జన్మించాడు. నాగరాజు కొంతకాలంగా మద్యానికి బానిసకాగా, గీత పుట్టింటికి వచ్చేసింది. కాగా నాగరాజు బంధువు మృతిచెందగా, భార్య గీతను తీసుకెళ్లేందుకు మంగళవారం నల్లివారిగూడెం వచ్చాడు. మద్యం మానేస్తేనే వస్తానని భార్య గీత స్పష్టం చేయడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీసీసీ గోదాంలో రేషన్ బియ్యం తనిఖీ



గోదాంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: స్థానిక గిరిజన సహకార సంస్థ(జీసీసీ) సముదాయంలోని గోదాంలో రేషన్ బియ్యం నిల్వలను రాష్ట్ర విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అంజయ్య నేతృత్వంలోని బృందం బుధవారం తనిఖీలు నిర్వహించింది. గోదాంలోని సన్నబియ్యం రేషన్ షాపులకు ఎన్ని క్వింటాళ్లు తరలించారు.. ఎంత నిల్వ ఉన్నాయి.. అనే వివరాలతో పాటు ఆర్‌ఓ ఎంట్రీలను పరిశీలించారు. దమ్మపేట, భద్రాచలంలో కూడా విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు డీటీ శ్రీనివాసరావు తెలిపారు.

గెలిచిన వారిపై ఓడిపోయిన వారి దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ప్రైవేట్ అంబులెన్స్ అసోసియేషన్ ఎన్నికలు ఇటీవల జరగగా.. ఓడిన వారు ఆగ్రహంతో గెలిచిన వర్గీయులపై దాడి చేశా రు. ఈ ఘటనలో ఓ అంబులెన్స్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స పొందుతున్నాడు. పలు ప్రైవే ట్ ఆస్పత్రులకు సంబంధించిన అంబులెన్స్ డ్రైవర్ల యూనియన్ ఎన్ని కలు ఇటీవల జరిగాయి. ఇప్పటికే ఉన్న కార్యవర్గ బాధ్యులు ఓడిపోగా, కొత్తవారు గెలిచారు. లావాదేవీలపై చర్చించేందుకు నూతన కార్యవర్గం బాధ్యులు మంగళవారం ఖమ్మం నెహ్రూనగర్‌లో పాత యూనియన్ బాధ్యుల వద్దకు వెళ్లగా ఆగ్రహంతో ఉన్న వారు లెక్కలు వివరించే క్రమాన గొడవకు దిగారు. ఆపై అంబులెన్స్ డ్రైవర్ వినయ్ ఆధ్వర్యాన ఏలూరి శ్రీకాంత్, మైదులు, మహేష్ తదితరులపై దాడి చేయగా శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించడంతో న్యాయమూర్తి శ్రీకాంత్ వాంగ్మూలం తీసుకున్నారు. కాగా, దాడికి పాల్పడిన వినయ్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టు టౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

ఈసారి 71 లక్షల మొక్కలు..

- వనమహోత్సవానికి సిద్ధమవుతున్న అధికారులు
- మొక్కలు నాటేందుకు ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలు
- రైతులకు ప్రత్యేకంగా టేకు మొక్కల పంపిణీ



నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు

చుంచుపల్లి: జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటే వన మహోత్సవ కార్యక్రమానికి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే వివిధ శాఖల వారీగా లక్ష్యాలను కేటాయించగా, మొక్కలను నాటేందుకు గుంతలను తవ్వుతున్నారు. జూలై 1 నుంచి వన మహోత్సవానికి శ్రీకారం చుట్టాలని అధికారులు భావిస్తున్నారు. గడిచిన ఆరు నెలలుగా గ్రామాల్లోని హరిత నర్సరీల్లో వన మహోత్సవానికి కావాల్సిన మొక్కలు పెంచుతున్నారు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా నర్సరీలను నిర్వహిస్తుండగా, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో 481 హరిత నర్సరీలు, అటవీ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో మరో 32 నర్సరీల్లో వచ్చే వన మహోత్సవంలో మొక్కలను నాటడానికి సిద్ధంగా ఉంచారు. పెద్ద గ్రామపంచాయతీల్లో 20 వేలు, చిన్న గ్రామ పంచాయతీల్లో 10 వేల చొప్పున 20 రకాల జాతులకు చెందిన మొక్కలను పెంచుతున్నారు. కానుగ, వేప, చింత, నేరేడు, గుల్ మొహర్, జామ, వెలగ, శిశు, మునగ, సీమ తంగేడు, తులసి, గులాబీ, మందార, గన్నేరు, దిరిశెన, అల్ల నేరేడు, ఉసిరి, దానిమ్మ, ఈత, బొప్పాయి, మందార, సిసో, టికోమ, బహునియా, సెలోఫాం తదితర రకాల మొక్కల పెంపకం చేపట్టారు. ఈ మొక్కలను గ్రామాల్లో అంతర్గత, అనుసంధాన రోడ్లకు ఇరువైపులా, చెరువు, కాలువ కట్టలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఖాళీ స్థలాల్లో నాటనున్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పూలు, పండ్లు, వేప తదితర మొక్కలను పంపిణీ చేయనున్నారు.

ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటనున్న శాఖలు

ప్రభుత్వ శాఖ	లక్ష్యం
డీఆర్డీఏ	30,00,000
ఫారెస్ట్ శాఖ	10,00,000
టీఎస్ఎఫ్‌డీసీ	12,90,000
సింగరేణి	3,30,000
ఎక్సైజ్‌శాఖ	1,00,000
అగ్రికల్చర్	5,00,000
ఇరిగేషన్	2,00,000

నర్సరీల్లో సిద్ధంగా..

డీఆర్డీఏ ఆధ్వర్యంలో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో 481 హరిత నర్సరీల్లో దాదాపు 50 లక్షల మొక్కల పెంపకం చేపట్టారు. అటవీ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో మరో 40 లక్షల వరకు మొక్కలను పెంచుతున్నారు. జిల్లాలో గత పదేళ్లుగా మొక్కలు నాటుతుండగా, ఈసారి 11 ఏట 71.41 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేకంగా పంపిణీ చేసేందుకు 20 లక్షల టేకు మొక్కలను సిద్ధం చేస్తున్నారు. అడిగిన ప్రతి సన్నకారు, చిన్నకారు రైతుకు ఎకరానికి 100 వరకు టేకు మొక్కలను ఇవ్వనున్నారు. మొదటి విడతలో 111.49 లక్షలు, రెండో విడత 161.33 లక్షలు, మూడో 163.09 లక్షలు, నాల్గవ విడత 96.17 లక్షలు, ఐదో 146.27 లక్షలు, ఆరవ 160.29 లక్షలు, ఏడవ 135.41 లక్షలు, ఎనిమిదవ 105.08 లక్షలు, తొమ్మిదో 55.13 లక్షలు, పదో విడతలో 70.61 లక్షల చొప్పున మొక్కలను నాటారు.

లక్ష్యాలు కేటాయించాం



త్వరలో చేపట్టబోయే వన మహోత్సవానికి కావాల్సిన మొక్కలు సిద్ధం చేస్తున్నాం. ఇందుకోసం గ్రామ పంచాయతీలు, అటవీ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నాం. శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాలను ఇప్పటికే కేటాయించాం. అన్ని శాఖల సహకారంతో వనమహోత్సవాన్ని విజయవంతం చేస్తాం. –ఎం.విద్యావందన, డీఆర్‌డీఏ

నిబంధనలకు విరుద్ధంగా విత్తనాల విక్రయం

ఐదుగురు వ్యాపారుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చండ్రుగొండ: నిబంధనలకు విరుద్ధంగా మిరప, పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఐదుగురు వ్యాపారులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. జూ లూరు పాడు సీఐ ఇంద్రసేనారెడ్డి కథనం ప్రకారం... సుజాతనగర్‌కు చెందిన డీలర్‌కు చండ్రుగొండ మండలంలో విక్రయించే అనుమతి లేనప్పటికీ బెండాలపాడులో విత్తనాలు విక్రయిస్తున్నాడు. దీంతో పోలీసులు దాడి చేశారు. పది కిలోల మిరప విత్తనాలను, 105 పత్తి విత్తన పాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 12,73,250 ఉంటుంది. ఈ ఘటనలో బెండాలపాడుకు చెందిన వీరభద్రం, అన్వేష్‌లతోపాటు సుజాతనగర్‌కు చెందిన శివనాగ్, సాయిదుర్గప్రసాద్, యోగానంద్‌లను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ శివరామకృష్ణ, ఏఓ వినయ్ పాల్గొన్నారు.

ట్రాక్‌పై మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

దుమ్ముగూడెం: ములకపాడు వైద్యశాల సమీపంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంలోని ట్రాక్‌పై ఉన్న మొక్కలను బుధవారం పోలీసులు తొలగించారు. ఐటీడీఏ అధికారుల నిర్లక్ష్యంతో ఇండోర్ స్టేడియంతో ప్రారంభించడంలేదని, దీంతో మైదానంలోని ట్రాక్‌పై మొక్కలు మొలిచాయని 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన సీఐ అశోక్‌కుమార్ తన సిబ్బందితో కలిసి శ్రమదానం చేపట్టి ట్రాక్‌పై మొలిచిన మొక్కలను తొలగించారు. ఐటీడీఏ అధికారులతో మాట్లాడి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయించి, త్వరలోనే ఇండోర్ స్టేడియం ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐ గణేష్, సిబ్బంది, స్థానిక యువకులు పాల్గొన్నారు.

ముగ్గురు వేటగాళ్ల అరెస్ట్

నాటు తుపాకీ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న అటవీశాఖ అధికారులు

ములకలపల్లి: వన్యప్రాణులను హతమారుస్తున్న ముగ్గురు వేటగాళ్లను అటవీశాఖ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం. రవికిరణ్ కథనం ప్రకారం.. ఏపీలోని వేలేరుపాడు మండలం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన కుంజా విష్ణు తన నాటుతుపాకీతో అశ్వారావుపేట మండలం నందిపాడుకు చెందిన కుర్సం రామకృష్ణతో కలిసి శుక్రవారం రాత్రి మండలంలోని కుమ్మరిపాడు గ్రామానికి వచ్చారు. అదే గ్రామానికి చెందిన పద్దం సీతారాములు, పద్దం వినోద్‌లతో కలిసి గ్రామ శివారులోని అటవీప్రాంతానికి వన్యప్రాణుల వేటకు వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి ఇంటికి వస్తుండగా పక్కా సమాచారంతో ఫారెస్ట్ అధికారులు గస్తీ ఏర్పాటు చేశారు, చాపరాలపల్లి వెస్ట్‌బీట్, కంపార్ట్‌మెంట్ నెంబర్ 24 వద్ద అటవీశాఖ సిబ్బందికి వేటగాళ్లు ఎదురుపడినా తప్పించుకున్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి విష్ణు, రామకృష్ణ, సీతారాములను మంగళవారం అదుపులోకి తీసుకొని, అరెస్ట్ చేశారు. కుంజా వినోద్ పరారీలో ఉన్నాడు. నిందితులను బుధవారం కొత్తగూడెం కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు.

హరియాణా గవర్నర్ దత్తాత్రేయ సంతాపం

భద్రాచలంటౌన్: పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీ మారెమల్ల సుబ్బారావు మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు హరియాణా రాజ్‌భవన్ నుంచి బుధవారం ఓ ప్రకటన విడుదలైంది. సుబ్బారావుతో తనకున్న సాన్నిహిత్యాన్ని దత్తాత్రేయ గుర్తు చేసుకున్నారు. ఆయన అకాల మృతి తనను తీవ్ర బాధకు గురిచేసిందని పేర్కొన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు

కొత్తగూడెం ఓఎస్డీ నరేందర్



దోమతెరలను పంపిణీ చేస్తున్న పోలీసులు

గుండాల: మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం ఓఎస్డీ నరేందర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని దామరతోగు గ్రామం నేతకాని గుంపులో పోలీస్ కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు ప్రభుత్వానికి సహకరిస్తూ అభివృద్ధి దిశగా పయనించాలని అన్నారు. అనుమానితులు వస్తే పోలీసులకు సమాచారం చేరవేయాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి అనవసరంగా జైలుపాలు కావొద్దని అన్నారు. అనంతరం 50 కుటుంబాలకు దోమ తెరలను పంపిణీ చేశారు. విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు ఇచ్చారు. దోమ తెరల పంపిణీకి సహకరించిన ప్రాణిక్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ రవీందర్, ఎస్సై సైదా రహూఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో మరో ఆరుగురు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీలో ఈ నెల 7న జరిగిన కనితి సతీష్ హత్య కేసులో మరో ఆరుగురు నిందితులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ కథనం ప్రకారం.. ఏఎస్ఆర్ కాలనీలో జరిగిన హత్య కేసులో ఇప్పటికే ప్రధాన నిందితుడు గంజి సాయి సహా 12మంది నిందితులను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న సారపాకకు చెందిన వల్లెపు నాని, భద్రాచలానికి చెందిన పగిడిపాటి మురళీకృష్ణ, షేక్ షరీఫ్, కొండవీటి పవన్‌కళ్యాణ్, ఎటపాక మండలంలోని శ్రీరంనగర్‌కాలనీకి చెందిన దామెర్ల రమేష్‌తోపాటు మరొకరిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఇంకా పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై మహిళలకు అవగాహన

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంత స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలతో పరిశ్రమలు ఏర్పాటు చేయించేలా అవగాహన కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జెడ్పీ కార్యాలయంలో డీఆర్‌డీఏ, సెర్ప్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో అడిషనల్‌డీఆర్‌డీఓ ఆర్.జయశ్రీ మాట్లాడారు. మహిళలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు సదస్సుల్లో ఔత్సాహికుల ను ఎంపిక చేసి పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణ, మెళకువలు, నైపుణ్యాభివృద్ధిపై 15 రోజుల శిక్షణ ఇస్తామని, అంతేకాక లైసెన్స్, రుణాల మంజూరులో అండగా నిలుస్తామని తెలిపారు.

చెక్ డ్యాంలో పడి వ్యక్తి మృతి



చిన్న వెంకయ్య (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం వైకుంఠధామం సమీపంలోని చెక్ డ్యాంలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెంగల చిన్న వెంకయ్య(55) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. బుధవారం చెక్ డ్యాం నీటిలో మృతదేహం లభ్యమైంది. అనారోగ్యం, మానస్థితి బాగాలేక బాధపడుతున్న చిన్న వెంకయ్య బహిర్భూమికి వెళ్లి చెక్ డ్యాంలో పడి మృతి చెంది ఉండవచ్చునని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

టేకులపల్లి: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని తావుర్యాతండా పంచాయతీ స్టేషన్‌తడికలపూడి గ్రామానికి చెందిన గుగులోత్ తరుణ్(20) పదేళ్లుగా అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోతుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. విషయం కుటుంబ సభ్యులకు కూడా చెప్పడంతో ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పాల్వంచలో..

పాల్వంచరూరల్: పురుగుల మందుతాగి చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం మృతిచెందాడు. ఎస్ఐ సురేష్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని చింతల్ ప్రాంతానికి చెందిన రామనాథ్ నరేష్(37) మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో ఉన్న అత్తవారింటికి వచ్చాడు. కాగా నరేష్‌కు, అతని భార్య త్రివేణి, ఆమె కుటుంబ సభ్యులకు మధ్య మంగళవారం గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

షీ టీం అదుపులో యువకుడు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రామవరంలోని మాతా శిశు ఆస్పత్రి వద్ద ఉన్న బస్‌స్టాప్ వద్ద ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న యువకుడిని బుధవారం షీ టీం ఎస్ఐ రమాదేవి అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. కొన్ని రోజులుగా ఓ యువతిని వేధిస్తుండటంతో ఆమె షీ టీంను ఆశ్రయించింది. దీంతో ఎస్ఐ రమాదేవి మఫ్టీలో వెళ్లి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలను ఎవరైనా వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులు భయపకుండా తమకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

గిరిజన విద్యార్థుల హాస్టళ్లలో విచారణ

భద్రాచలం న్యాయమూర్తికి నివేదిక ఇవ్వనున్న నిజనిర్ధారణ కమిటీ



విచారణ నిర్వహిస్తున్న నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని గిరిజన జూనియర్ కళాశాల, స్కూల్ విద్యార్థుల హాస్టళ్లలో అందుతున్న సౌకర్యాలపై నిజనిర్ధారణ కమిటీ బుధవారం విచారణ నిర్వహించింది. ఈ ఏడాది మార్చి 20న వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేవని, నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థుల ఫిర్యాదుపై భద్రాచలంలో కోర్టులో కేసు నమోదైంది. దీంతో భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శివ నాయక్ ఆదేశాల మేరకు నిజనిర్ధారణ కమిటీ సభ్యులు న్యాయవాది చుక్క నాగఅంబేడ్కర్, పేరాల నాగరాజు, ఎంవీ రమణలు హాస్టళ్లను సందర్శించి, స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్కూలు విద్యార్థులకు హాస్టల్లో సరైన బెడ్లు లేవని, తగిన సంఖ్యలో మరుగుదొడ్లు కూడా లేవని, దుర్వాసన వెదజల్లుతున్నాయని పేర్కొన్నారు. సరిపడినంత భోజనం కూడా పెట్టడం లేదని, మెస్ బిల్లులు కూడా సక్రమంగా అందట్లేదని విద్యార్థులు కమిటీ సభ్యులకు తెలిపారు. ప్రిన్సిపాల్, వార్డెన్‌ను విచారించగా దాదాపు 8 నెలల నుంచి మెస్ బిల్లు రావట్లేదని, దీంతో కావలసినన్ని సరుకులు అందటంలేదని వివరించారు. హాస్టళ్ల స్థితిగతులపై న్యాయమూర్తికి నివేదిక ఇస్తామని నిజనిర్ధారణ కమిటీ సభ్యులు తెలిపారు.

పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వాలి

అటవీ పనుల పురోగతిపై ఈపీటీఆర్ఐ బృందం అధ్యయనం



మొక్కల వివరాలు సేకరిస్తున్న బృందం సభ్యులు

కరకగూడెం: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) బృందం సభ్యులు సూచించారు. మండలంలోని రఘునాథపాలెం, చిరుమళ్ల, కలవలనాగారం, నర్సాపురం అటవీ ప్రాంతాల్లో కంపా నిధులతో చేపట్టిన వివిధ పనుల పురోగతిని బుధవారం వారు పరిశీలించారు. చెక్ డ్యామ్‌లు, ఫైర్ లైన్స్, ప్లాంటేషన్, చెక్ పీడీల కొలతలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల్లో చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో భూగర్భ జలమట్టాలు పెరుగుతాయని, ఇది పర్యావరణ సమతుల్యతకు చాలా అవసరమని అన్నారు. అలాగే వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూమిలోకి ఇంకి, వేసవిలో కూడా పచ్చదనాన్ని కాపాడేందుకు ఉపకరిస్తాయని తెలిపారు. మొక్కల పెరుగుదల బాగుందని, సరైన మొక్కలను ఎంచుకోవడం, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడంతో సత్ఫలితాలు కనిపిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బృందం సభ్యులు ఎండీ నసీర్ పాషా, పద్మజ, శిరీష, ఏడూళ్ల బయ్యారం రేంజర్ తేజస్వి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లు క్రమశిక్షణతో మెలగాలి



కేడెట్లతో ఎన్‌సీసీ అధికారులు

ఖమ్మంస్పోర్ట్స్: ఎన్‌సీసీ కేడెట్లు క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నత స్థానాలకు చేరాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ నార్సింగ్ షైలానీ సూచించారు. ఖమ్మం హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లోని ఎన్‌సీసీయూనిట్‌ను బుధవారం పరిశీలించిన ఆయన కేడెట్లతో మాట్లాడారు. కేడెట్లు ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని తెలిపారు. భారత ఆర్మీలో చేపట్టే ఎంపికల్లో ఎన్‌సీసీ కేడెట్లకు ప్రత్యేక కోటా ఉంటుందని చెప్పారు. అనంతరం గ్రూప్ కమాండర్ కల్నల్, వీరచక్ర అవార్డు గ్రహీత సచిన్ నింబాల్కర్, ఏడీ (పర్సనల్) కల్నల్ సంజీవ్‌కుమార్, 11వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్‌కుమార్ భద్ర, హార్వెస్ట్ కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డితో పాటు జి.బాలకృష్ణ, మమత, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖమ్మంలోని ఎన్‌సీసీ బెటాలియన్‌ను సందర్శించారు.

రూ.3.60 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



నిందితులు, గంజాయితో ఎక్సైజ్ ఉద్యోగులు

ఖమ్మంక్రైం: ఖమ్మం బైపాస్ రోడ్డు సమీపాన గంజాయి విక్రయిస్తున్న ముఠాను ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకర రమేశ్ నేతృత్వంలో మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టగా టీఎన్జీవోస్ కాలనీకి చెందిన కట్టగోరు రవితేజ, పాకబండబజార్‌కు చెందిన జిలాన్ సైఫ్, సంభానీనగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ బాషా, పిండిప్రోలుకు చెందిన బాసిగోంపు గోపి, కోలా శ్రీకాంత్ పట్టుబడ్డారు. ఇదే ముఠాకు సంబంధించి ఎలగందుల సందీప్ పరారీలో ఉండగా, వీరంతా ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి బైక్‌లపై వెళ్లి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. దీంతో నిందితుల నుంచి రూ.3.60 లక్షల విలువైన గంజాయితో పాటు నాలుగు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో సీఐ రమేశ్‌తోపాటు ఎస్ఐ శ్రీహరిరావు, ఉద్యోగులు కరీం, బాలు, సుధీర్, వెంకటేశ్, విజయ్, హనుమంతరావు, హరీశ్, వీరబాబు పాల్గొన్నారు.

రావికంపాడులో చోరీ

చండ్రుగొండ : మండల పరిధిలోని రావికంపాడు గ్రామంలో ఓ రైతు ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా బుధవారం రాత్రి వెలుగుచూసింది. బాధితుల కథనం ప్రకారం.. రావికంపాడు గ్రామానికి చెందిన పిన్నబోయిన వెంకటేశ్వర్లు ఇంట్లో రూ.1.75 లక్షల చోరీ జరిగింది. వెంకటేశ్వర్లు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న తన భార్యను ఈ నెల 15న ఏపీ రాష్ట్రంలోని ఏలూరుకు చికిత్స నిమిత్తం తీసుకెళ్లాడు. తిరిగి వచ్చాక పరిశీలించగా ఇంట్లోని బీరువాలో రూ. 50 వేలు నగదు, రూ. లక్ష విలువైన బంగారు ఆభరణాలు, రూ. 25 వేల విలువైన వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.